జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 11-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 68 పేజీలు: 8 వెల : రూ.7




# ఈ స్టాంప్‌లు.. మా పాట్లు కాట్లాయి...!







* కమీషన్లు తగ్గడంతో రోడ్డున పడ్డ స్టాంప్ వెండర్లు
* దస్తావేజుల విక్రయానికి ఆసక్తి చూపని వైనం
* పాత పద్ధతినే కొనసాగించాలని స్టాంప్ వెండర్ల డిమాండ్

**శ్రీకాకుళం, జులై 10 (వార్త):** రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆస్తుల క్రయ, విక్రయాలు, అగ్రిమెంట్లు, అఫిడవిట్లు చేసేందుకు కొనుగోలుదారులు తప్పనిసరిగా దస్తావేజులు స్టాంప్ వెండర్లు వద్దనే కొనుగోలు చేయాల్సివుంది. గతంలో రూ.1000, రూ.500, రూ.100, రూ.50, రూ.20, రూ.10లు దస్తావేజులు ఉండేవి. వాటి ద్వారా అవసరం మేరకు రిజిస్ట్రేషన్, తదితర ప్రక్రియ జరిగేది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో పెద్ద ఎత్తున స్టాంపుల కుంభకోణం జరిగిన నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం రూ.500లు పైన ఉన్న దస్తావేజులను రద్దు చేసింది. ప్రస్తుతం దస్తావేజులను రూ.100లు లోపే ఉన్నాయి. ప్రతి రిజిస్ట్రేషన్ కార్యాలయం ఆవరణలో కొందరు స్టాంపు వెండర్లు దస్తావేజుల లేఖరుల షాపుల వద్ద ఉంటూ వీటిని విక్రయిస్తున్నారు. లక్ష రూపాయలు మేర దస్తావేజులు విక్రయిస్తే రూ.5వేలు వరకూ కమీషన్లు గతంలో వచ్చేవి. గత ప్రభుత్వం ఈ కమీషన్లను తగ్గించేసింది. లక్ష రూపాయలు దస్తావేజులు విక్రయిస్తే కేవలం 5 శాతం మాత్రమే కమీషన్ ఇస్తోంది. కమీషన్లు తగ్గిపోవడంతో స్టాంపు వెండర్లు రోడ్డున పడ్డారు. కమీషన్లు చాలక పోవడంతో, పని గిట్టుబాటు కాక, మరో వృత్తిలోకి వెళ్లలేక ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈ-స్టాంపులు వచ్చేశాయి. డైరెక్ట్‌గా ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డులోని పేరు, దేని నిమిత్తం దస్తావేజు అవసరమన్నది ఫీడ్ చేస్తే ఈస్టాంపు కంప్యూటర్ ప్రింట్ వచ్చేస్తుంది. దీని వల్ల దస్తావేజుల ప్రింటింగ్ ఖర్చు ప్రభుత్వానికి తగ్గిపోయింది. గతంలో నాసిక్‌లో దస్తావేజులు ప్రింట్ అయి వచ్చేది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్టాక్ హోల్డింగ్ కంపెనీతో టైఅప్ పెట్టుకుని ఈ స్టాంపులను అందిస్తోంది. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయంతో పాటు ఖర్చు కూడా తగ్గింది. అయితే స్టాంపు వెండర్లకు ఈ విధానం శాపంగా మారింది. ఒక్కో స్టాంపు వెండరు కంప్యూటర్, ప్రింటర్, ఇంటర్‌నెట్‌ను తీసుకోవాల్సివుంది. దీని కోసం సుమారు రూ.40వేలు ఖర్చవుతుంది. ప్రతినెలా నెట్ బిల్లు రూ.1000 వరకూ ఖర్చవుతుంది. వచ్చిన కమీషన్ల కన్నా ఖర్చులు బారెడు అవుతున్నాయని స్టాంపు వెండర్లు వాపోతున్నారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి 86 మంది స్టాంపు వెండర్లు ఉన్నారు. వీరిలో చాలా మంది ఈ వృత్తిని ఆపేయగా, మరికొంతమంది తప్పనిసరి పరిస్థితులు కొనసాగిస్తున్నారు. దస్తావేజుల లేఖరుల వద్దనే ఉంటూ ఈ వృత్తిని చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో మళ్లీ పాతపద్ధతినే కొనసాగించాలంటూ కొందరు స్టాంపు వెండర్లు గతంలో నిరసన ప్రదర్శనలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం సీఎం చంద్రబాబు అయినా తమ సమస్యలు తెలుసుకుని ఆదుకోవాలని స్టాంపు వెండర్ల సంఘ ప్రతినిధులు కోరుతున్నారు.

# వీడు మామూలోడు కాదు..

* ఉద్యోగాలిస్తామని పంచాయతీ కార్యదర్శి మోసం
* పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
* కార్యదర్శిపై గతంలోనూ పీఎస్‌లలో కేసులు
* ఓ సారి ఏసీబీ ట్రాప్‌లో కూడా
* అయినా మారని వక్రబుద్ధి



**శ్రీకాకుళం క్రైం, జులై 10(వార్త):** ఓ పంచాయతీ కార్యదర్శి.. ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి నుంచి లక్ష, ప్రభుత్వం నుంచి వాహనం ఇప్పిస్తానని మరో లక్ష.. ఇలా కొందరిని మోసగిస్తున్న వైనం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శిగా మన్నం సతీష్‌బాబు పనిచేస్తున్నాడు. శ్రీకాకుళం నగరంలోని శ్రీనివాసనగర్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న మైగాపు గౌరీశంకర్ అనే వ్యక్తికి ప్రభుత్వం నుంచి వాహనం ఇప్పిస్తానని నమ్మించాడు. ఈ క్రమంలో శంకర్ నుంచి రూ.1.36లక్షలు వసూలు చేశాడు. అలాగే శంకర్ కొడుకుకు ఉద్యోగం ఇప్పిస్తానని మరో లక్ష రూపాయలు తీసుకున్నాడు. ఏడాది గడిచిన వాహనం రాకపోగా, ఉద్యోగం కూడా ఇప్పించకపోవటంతో సతీష్‌బాబును శంకర్ నిలదీశాడు. తనకు ఎటువంటి సంబంధం లేదని, డబ్బులు ఇవ్వలేదని సతీష్‌బాబు దబాయించాడు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన శంకర్ బుధవారం శ్రీకాకుళం ఒకటో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. తనకు న్యాయం చేయాలని, డబ్బులు తిరిగి ఇప్పించాలంటూ జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. అలాగే శ్రీకాకుళం నగరంలోని క్రిస్టియన్ కాలనీలో నివశిస్తున్న పిల్లా నరేష్ అనే యువకుడికి ఇండియన్ బ్యాంకులో మెసెంజర్ ఉద్యోగం ఇప్పిస్తానని గతేడాది అక్టోబరు 30 నుంచి ఈ ఏడాది జనవరి వరకు దశల వారీగా ఫోన్‌పే ద్వారా రూ.5,11,392 లక్షలు తీసుకుని సతీష్‌బాబు మోసం చేసి నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై బాధితుడు ఈ నెల 1న జడ్పీలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు సతీష్‌బాబుకు నోటీసులు ఇవ్వాలని మందస ఎంపీడీవోకు, డీపీవో సూచించారు. దీంతో సతీష్‌బాబుకు నోటీసులు జారీ చేసి ఈ నెల 12న శాఖాపరమైన విచారణకు హాజరుకావాలని ఎంపీడీవో ఆదేశించారు. అయితే గతంలో సరుబుజ్జిలిలో సతీష్‌బాబు ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయ్యాడు. కాగా, సతీష్‌బాబుపై ఇప్పటికే వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఉద్యోగాల పేరిట మోసం చేశాడని రెండు కేసులు గతంలో నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.

## నష్ట పరిహారం..
# ఇంకెంతివ్వాలి

* మూలపేట పోర్టు స్థితిగతులు, భూసేకరణపై కలెక్టర్ ఆరా
* నిర్వాసితుల కాలనీ నిర్మాణం పరిశీలన

**సంతబొమ్మాళి, జులై 10 (వార్త):** జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం మూలపేట పోర్టు పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులను, వాటి స్థితిగతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విశ్వసముద్ర కంపెనీ ప్రతినిధులు, పోర్టు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇంకా పరిహారం ఎంతమందికి ఇవ్వాలి, జిరాయితీ భూములకు ఎంత పరిహారం చెల్లించాలి, భూ సేకరణపై రైతుల డిమాండ్లను అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోర్టు లో నిర్మాణమవుతున్న సౌత్ బ్రేక్ వాటర్ పనులు, బర్మ్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్వాసితులకోసం ఏర్పాటు చేస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీ, రైల్వే ట్రాక్, సాల్టు భూములు పరిశీలించారు. ఆయన వెంట టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమర్, సంతబొమ్మాళి తహసిల్దార్ జి సత్యనారాయణ, రెవిన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.



## జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించండి

**మందస, జులై10 (వార్త):** మందస ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సమస్యలు పరిష్కరించాలని ఆర్జేడి ఐ.శారదకు పూర్వ విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తనిఖీ నిమిత్తం వచ్చిన ఆర్జేడికు వారు కలిశారు. జూనియర్ కాలేజీలో మౌలిక వసతులు కల్పించాలని, ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయాలన్నారు. తెలుగు ఒరియా మీడియంలో ఈ కళాశాలలో పేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, కాలేజీని మరోచోటకు తరలించవద్దని కోరారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు వడ్డి గోపాలకృష్ణ, శ్రీనివాస్ పాడి, ఆర్. దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# లేబర్ కోడ్లు రద్దయ్యే వరకూ పోరాటం

*** కార్మికుల సమస్యలు పరిష్కరించండి * సీఐటీయూ నాయకుల డిమాండ్ * కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ**

**మందస, జులై 10 (వార్త):** కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుండి కార్మికులు ర్యాలీగా వెళ్ళి, తహశీల్దార్ ఎల్. తిరుమలబాబుకు వినతి పత్రం అందించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీ కరణ పథకంను ఆపాలని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధిహామీ, నేకో, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలన్నారు. కనీసవేతనాలు చెల్లించాలని, కనీస వేతనం, పెన్షన్ సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనాలు నెలకు రూ.26వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, కంటింజెంట్, పార్టైం, గెస్ట్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టరును తొలగించినా కార్మికులను తొలగించరాదని, అందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రెగ్యులర్ చెయ్యాలని, ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ను అమలు చేయాలని, నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలన్నారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలని, పరిశ్రమలలో భద్రత చర్యలు చేపట్టాలని, వీఆర్యేలకు టైమ్ స్కేల్ అమలు చేయాలని, నామినీలను వీఆర్యే లుగా గుర్తించాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, శ్యామ్ క్రగ్ పిస్టన్స్, రింగ్స్ యాజమాన్యం 30 సంవత్సరాలు సర్వీసు పేరుతో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వేతన ఒప్పందం వెంటనే పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.దేవేంద్ర, కార్యదర్శి కే.కేశవరావు, కార్మిక సంఘం నాయకులు టొంప లక్ష్మీనారాయణ, ఎం.ధర్మ, ఆర్.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



### కార్మిక చట్టాలు రద్దు చేయాలి

**పలాస, జులై 10(వార్త):** అఖిల భారత కోర్కెల దినం సందర్బంగా పలాస సీఐటీయూ ఆధ్వర్యంలో కాశీబుగ్గ పాత బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీ చేశారు. ఈ సందర్బంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 26 వేలు కనీస వేతనాలు అమలు చేయాలని, స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. అంగన్వాడీ, ఆశ లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కార్మికులందరికి, పి యఫ్, ఇ యస్ ఐ, గ్రాడ్యూటి, పింఛన్ అమలుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆటో మోటార్ కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ చట్టం అమలు చేయాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటికరణ ఆపాలని కోరారు. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో అంగన్వాడీ యూనియన్ నాయకులు బి సునీత, పి పద్మ, కె సరస్వతి, ఆర్ అప్పలనరసమ్మ, ఆశ యూనియన్ నాయకులు యం లావణ్య, వై హేమలత, ఐ యజ్ఞ, ఎన్ ద్రౌపది, జి జ్యోతి, హేమావతి,మధ్యాహ్నం భోజనం పథకం యూనియన్ నాయకులు పి భూదేవి, బి శశిరేఖ, వై మనమ్మ, కె మహాలక్ష్మి, తులసి, శకుంతల,భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు టి సింహాద్రి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సి హెచ్ మురగన్, యం రవి, స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు స్వాతి, అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్నం భోజనం కార్మికులు, స్వీపర్స్, మున్సిపల్, నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



### సీఐటీయూ ధర్నా

**కొత్తూరు, జులై 10(వార్త):** అఖిలభారత కోర్కెల దినం సందర్భంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం కొత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. అనంతరం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మికులందరికీ కనీస వేతనాలు నెలకు రూ.26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలని, రైస్ మిల్ కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్లను అమలు చేయడానికి సిద్ధమవుతుందని, ఐక్య పోరాటాలు ద్వారా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు, వివిధ కార్మిక సంఘాల నాయకులు కూర్మారావు, గౌరమ్మ, జ్యోత్స్న, రజనీ, అనసూయ, పద్మ, సునీత, మధురవేణి, ఉమ, అమ్మాయమ్మ, భార్గవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## పారిశుధ్య పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

**నరసన్నపేట/జలుమూరు, జులై 10(వార్త):** నరసన్నపేట మండలంలో పారిశుధ్య పనులను పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్టు ఎంపీడీవో రామకృష్ణారావు బుధవారం తెలిపారు. మండలంలో 34 పంచాయతీలు ఉన్నాయన్నారు. తనతో పాటు ఏపీవో యుగంధర్, ఎంఈఓ శాంతారావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్ శంకర్, హౌసింగ్ ఏఈ శంకర్రావు ఏపీఎం లక్ష్మి, మండల ఇంజనీర్ మోహన్‌రావులు పర్యవేక్షిస్తారని చెప్పారు.

## డిజిటల్ అసిస్టెంట్‌పై దాడికి ఫిర్యాదు

**మందస, జులై10 (వార్త):** మండలంలోని ఉద్దాన ప్రాంతం లొహరి బంద సచివాలయ పరిధిలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ ఖాదర్ బుఖారిపై స్థానిక సర్పంచ్ రాపాక జానకమ్మ తనయుడు వైఎస్ఆర్సీపీ నాయకుడు రాపాక శేషగిరి చేయి చేసుకున్నారని మందస పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ దగ్గర బంధువు కుమారుడు కుల, ఆదాయ సర్టిఫికెట్ అప్లై చేసి ఉన్నారు. డిజిటల్ అసిస్టెంట్ ను సర్టిఫికెట్ గురించి అడగగా, తహశీల్దార్ కార్యాలయంలో తెలుసుకొని చెప్తానని అన్నారు. దీంతో కోపంతో సర్పంచ్ శేషగిరి సచివాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్‌ను చెంపపై కొట్టి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం పై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాపు చేపట్టారు.

## 15న మందసలో నేత్రవైద్య శిబిరం

**మందస, జులై 10 (వార్త):** మందస పట్టణంలో ఈ నెల 15న కంటి శిబిరం నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ తెలిపారు. కార్యక్రమంలో కంటి ఆపరేషన్ కు గుర్తించిన వారికి, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులతో ఐ మెడికల్ క్యాంపు నిర్వహించబడుతుందన్నారు. సత్యసాయి మందిరంలో ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఆపరేషన్ చేయించుకునే వారు పేషెంట్ ఆధార్ ఆరోగ్యశ్రీ కార్డుబ్యాంకు పాస్ పుస్తకం తీసుకొని రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9494588963 అనే ఫోన్ నంబర్ కు సంప్రదించాలని సూచించారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి



**పలాస, జులై 10(వార్త):** సమస్యలు పరిష్కరించాలటూ పలాస మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్‌కు పారిశుధ్య కార్మికులు మొరపెట్టుకున్నారు. బుధవారం కమిషనర్ కార్యాలయంతో పారిశుధ్య కార్మికులు తమ గోడును వెల్లబుచ్చారు. పారిశుధ్య కార్మికుల నాయకుడు మురుగన్ మాట్లాడుతూ కోవిడ్ కష్ట కాలంలో 40 మంది కార్మికులు పనిచేశారని, జీతం కార్మికులు రాకపోయినప్పటికీ అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు కోరిక మేరకు పనిచేశామన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పారిశుధ్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారని, పెరుగుతున్న జనాభివృద్ధికి పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో ఈ విషయాన్ని మున్సిపల్ మంత్రి దృష్టిలో పెట్టి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారన్నారు. ఈ మేరకు కమిషనర్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ఉద్యోగాలు భరోసా కల్పించాలంటే ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ కమిటీ ఆధ్వర్యంలో భర్తీ అయితే న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ విషయమై పలాస ఎమ్మెల్యే దృష్టిలో ఉన్నదన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు బాలకృష్ణ, సుజాత, ఆదిలక్ష్మి, సోమేశ్వరరావు, మోహన్ రావు తదితరులు ఉన్నారు.

## వివాదాస్పద వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు

**గార, జులై 10 (వార్త):** గుంటూరు పట్టణానికి చెందిన అనిల్ కుమార్ అనే వ్యక్తి మహిళలపై, చిన్నారులపై సెల్ఫీ వీడియోలో అసభ్యకరంగా వివాదాస్పద చేస్తున్నాడని అతడినిపై చర్యలు తీసుకోవాలని జిల్లా టిడిపి ఎస్సీ సెల్ విభాగ కార్యదర్శి గోర అన్నారు. బుధవారం గార పోలీస్ స్టేషన్లో హౌస్ ఆఫీసర్ కె.కృష్ణ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు.



## అమర వీరుల త్యాగాలే...
# విప్లవ పోరాటాలకు మార్గనిర్దేశం

**న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గొరకల బాలకృష్ణ**

**పలాస, జులై 10(వార్త):** పోరాటంలో మృతి చెందిన వారికి మరణం లేదని, వారి ప్రాణ త్యాగాలే సాగే పోరాటాలకు మార్గనిర్దేశం చేస్తున్నాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటి సభ్యుడు గొరకల బాలకృష్ణ అన్నారు. శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంల 54వ వర్ధంతిని బుధవారం బొడ్డపాడు అమర వీరుల స్మారక భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై నెలలో అమరులైన విప్లవోద్యమ ధృవతారలు కామ్రేడ్స్ చారుమజుందార్, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, మధుసూదనరాజ్, రంగవల్లిలకుసైతం ఈ సందర్భంగా ఆయన వారి త్యాగాలను గుర్తు చేసుకొని విప్లవ జోహార్లు తెలిపారు. ఆదివాసీలకు ప్రత్యేక రక్షణ, హక్కులను రద్దుచేసి అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం కుట్రలు సాగిస్తోందని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ విమర్శించారు. అటవీ సంరక్షణ నియమాల సవరణలు - 2022ను తెచ్చి దేశంలోని ఆదివాసీలను అడవి నుండి, వారి నివాసాల నుండి, భూముల నుండి తరిమివేసి అక్కడ వున్న అపార అటవీ సంపద, ఖనిజ వనరులను బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి బీజేపీ ప్రభుత్వం పూనుకుందని ధ్వజమెత్తారు. ఏఐకేయంయస్ జిల్లా నాయకులు రాపాక మాధవరావు మాట్లాడుతూ సంవత్సరానికి పైగా ఢిల్లీలో రైతాంగం సాగించిన ఆందోళన ఫలితంగా రద్దుచేసిన మూడు రైతు వ్యతిరేక చట్టాలను తిరిగి తీసుకురావడానికి మోడీ షా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పీవోయల్ జిల్లా కన్వీనర్ సార జగన్ మాట్లాడుతూ ఇప్పటికే 'ఉపా' వంటి క్రూర చట్టాలతో ప్రజల హక్కుల కోసం నిలబడుతున్న ప్రజాస్వామికవాదులు, మేధావులు, రచయితలను అక్రమంగా సంవత్సరాల తరబడి జైళ్ళలో నిర్బంధిస్తున్న స్థితిలో కేంద్రం తెచ్చిన మూడు న్యాయ చట్టాలు ప్రజలను, వారి హక్కులను మరింత తీవ్రంగా అణచివేస్తాయనీ, ప్రజలని పీడించుకు తినే దోపిడీవర్గాలకు విశేషంగా సేవచేస్తాయని జగన్ విమర్శించారు. ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు పోతనపల్లి మల్లేశ్వరరావు మాట్లాడుతూ 44 కార్మిక, పారిశ్రామిక చట్టాల స్థానంలో తెచ్చిన 4 కోడ్లను కార్మికవర్గం ఎంత ఆందోళన చేసినా రద్దుచేయకుండా మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా అమలుకు పూనుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు విప్లవ ప్రజా సంఘాల నాయకులు జడ్డే అప్పన్న , కర్రి అప్పారావు, గర్తం కామేశ్వరరావు, బుడత ముఖలింగం, రెయ్య సింహాద్రి, ఆర్. అప్పలస్వామి, రాజారావు, కృష్ణ తదితరులు పాల్గొని అమర వీరులకు నివాళులు అర్పించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అసంపూర్తిగా వనిత వంతెన



**పోలాకి/జలుమూరు, జులై 10 (వార్త):** పోలాకి, గార మండలాలకు అనుసంధానంగా వనిత మండలం వద్ద చేపట్టిన వంతెన నిర్మాణం గత ఐదేళ్లుగా నిలిచిపోయింది. 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి రూ.72 కోట్లతో శ్రీకారం చుట్టారు. 60 శాతంపైగానే పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ఈ వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వైసీపీ నేతలు పూర్తిగా దీన్ని విస్మరించారు. ఈసారి టీడీపీ ప్రభుత్వం రావడంతో ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.




## 68మందికి నేత్ర పరీక్షలు

**సంతబొమ్మాళి, జులై 10 (వార్త):** సంతబొమ్మాళిలో బుధవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 68 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35మందికి కంటి ఆపరేషన్ లు అవసరం ఉన్నందున శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి సౌజన్యంతో స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆప్టికల్స్ ఆవరణంలో ఏర్పాటు చేసిన శిబిరంలో అప్తాలమిక్ వైద్యుడు శివప్రసాద్ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే శ్రీ వెంకటేశ్వరఆప్టీకల్స్ సంస్థ ప్రతినిధి అల్లు కోమలి రోగులకు సేవలు అందించారు. ఈ శిబిరంలో అల్లు రమేష్ కుమార్, శంకర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ టి రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరావు కుటుంబీకులకు పరామర్శ

**జలుమూరు, జులై 10 (వార్త):** చిన్నదుగాం గ్రామం సర్పంచ్ పీస శ్రీనివాసరావు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. సంతాప సభలో పాల్గొని శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట జలుమూరు టీడీపీ మండల నాయకులు ఉన్నారు.

## డెంగ్యూ నివారణ అవగాహనతోనే సాధ్యం



**నరసన్నపేట/జలుమూరు, జులై 10 (వార్త):** డెంగ్యూ, తదితర వ్యాధుల నివారణ అవగాహనతోనే సాధ్యమని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుజాత అన్నారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులు వలన దోమలు చెందుతున్నాయని, వాటిని నియంత్రించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బుధవారం నరసన్నపేట మండలం ఉర్లాం బాలుర బీసీ హాస్టల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దోమలతోనే డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. పరిసరాలు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సిర్ల పరామర్శ



**పలాస, జులై 10(వార్త):** ఇటీవల కాలంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కుమారుడు ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సిర్ల రవిచంద్ర బల్ల గిరిబాబును బుధవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డి.నాగు, సిర్ల అనుచరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి


**జలుమూరు, జులై10 (వార్త):** గ్రామాలలో తల్లిదండ్రులు విజ్ఞతతో ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు కోరారు. సురవరం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో గ్రామంలో బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# వృద్ధురాలిని ఆదుకున్న నారీమణి


* ఇంటి నిర్మాణం చేసి అందజేసిన ట్రస్టు వ్యవస్థాపకుడు దుర్గారావు బాబ్జీ * హర్షం వ్యక్తం చేసిన మండల ప్రజలు

**సంతబొమ్మాళి, జులై10 (వార్త):** నౌపడ గ్రామంలో నిరుపేద వృద్ధురాలు గుజ్జు బూలమ్మకు చెన్నూరు నారీమణి చారిటబుల్ ట్రస్ట్ గృహ నిర్మాణం చేసి ఆదుకున్నారు. చెన్నూరు నారీమణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెన్నూరు దుర్గారావు బాబ్జీ గృహాన్ని నిర్మించారు. తన ట్రస్టు ద్వారా మేస్త్రి రెయ్యి గోవింద సహాయంతో సుమారు రూ. 60 వేలు ఖర్చుతో నౌపడలో వరిమడి దగ్గర రేకులతో గృహాన్ని నిర్మించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మహిళలు యువకుల ఆధ్వర్యంలో గృహప్రవేశం జరిపించారు. నిరుపేద వృద్ధురాలు బూలమ్మకు నెల రోజులకు సరిపడా కిరాణా సరుకులను, వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా దుర్గారావు బాబ్జి మాట్లాడుతూ ప్రతి సంక్రాంతికి నిరుపేదలకు ట్రస్ట్ ద్వారా బట్టలు పంపిణీ చేస్తున్నామన్నారు. గూడు లేదని బూలమ్మ తమ దృష్టికి తీసుకువచ్చిందని, ఆమె దీన పరిస్థితి చూసి సహాయం చేసామని, ట్రస్ట్ ద్వారా ఆమె యోగక్షేమాలు చూస్తామని తెలిపారు. వృద్ధురాలికి అండగా నిలిచిన ట్రస్ట్ చైర్మన్ చెన్నూరు దుర్గారావు బాబ్జికు స్థానికులతో పాటు యువకులు అభినందనలు తెలిపారు.




# ముస్లిం మైనారిటీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

**పలాస, జులై 10(వార్త):** ముస్లిం మైనారిటీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ముస్లిం మైనారిటీ జిల్లా తెలుగు దేశం కార్యదర్శి సయ్యద్ శిలార్ అన్నారు. కాశీబుగ్గ జామియా మసీదులో బుధవారం కాశీబుగ్గ మైనారిటీ లీడర్ జిల్లా మైనార్టీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్కెఎండి గౌస్ ఆధ్వర్యంలో జిల్లా ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ముస్లిం మైనారిటీలను పట్టించుకోలేదన్నారు. ముస్లింల భూములు అన్యాక్రాంతం కాకుండా కాకుండా చూడాలని కోరారు. ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో షాది ఖానాలు ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. పేద ముస్లింలకు ఇళ్లస్థలాలు అందించాలన్నారు. సమావేశంలో జామియా మస్జిద్ ప్రెసిడెంట్ ఎస్ కె భాష, సెక్రటరీ ఎస్ కె బషీర్, జిల్లా ముస్లిం మైనారిటీలు సభ్యులు ఎస్ కె నిజాముద్దీన్, బహదూర్ భాష, ఎస్ కె మోహామద్, షేక్ ఖాసీం, ఇచ్ఛాపురం మైనారిటీ లీడర్ మొహమ్మద్ జిలానీ, జిల్లాలో ఉన్న ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



# వరహావతారంలో జగన్నాథుడు





**శ్రీకాకుళం టౌన్, జులై 10(వార్త):** శ్రీకాకుళం నగరంలోని ఇల్లిసిపురంలో ఉన్న గుండిచా మందిరంలో జగన్నాథ స్వామి వరహావతారంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన పూజారి సుభాష్ పండా ఆధ్వర్యంలో స్వామి వారికి అలంకరించి పూజలు చేశారు. స్వామివారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. రాత్రి భక్తులకు అన్నదానం చేశారు.

## స్వామి సన్నిధిలో గీతా పారాయణం

**సారవకోట/జలుమూరు, జులై 10(వార్త):** సారవకోట మండలం అవలంగి గ్రామంలో వెలసిన జగన్నాథ స్వామి భక్తులకు నాల్గవ రోజైన బుధవారం నరసింహ అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు, నిర్వాహకులు, అర్చకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో గీతాపారాయణం చేశారు.

## నృసింహ అవతారంలో..

**హిరమండలం, జులై 10(వార్త):** మండల కేంద్రంలోని గుండిచా మందిరంలో జగన్నాథ స్వామి భక్తులయికు నృసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సురేష్ పాడి, శ్రీనివాస్ పాడీలు జగన్నాధుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం హీరా పంచమి పురస్కరించుకుని లక్ష్మీ దేవి అమ్మవారిని గుండిచా మందిరం నుంచి మోణింగి వీధి వరకు పల్లకిలో ఊరేగిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.








## ఏఐవైఎఫ్ ర్యాలీ

**నరసన్నపేట/జలుమూరు, జులై 10 (వార్త):** మత్తు పదార్ధాల బారి నుంచి యువత, విద్యార్థులను రక్షించాలని కోరుతూ నరసన్నపేటలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంస్థల్లోకి మత్తు పదార్థాలు రాకుండా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# వాన దోబూచులాట

* జులై వచ్చినా కరుణించని వరుణుడు
* చిరుజల్లులకే పరిమితం
* భారీ వర్షాల కోసం అన్నదాతల ఆరాటం
* విత్తనాలు వేసి ఆకాశం వైపు చూస్తున్న రైతన్నలు



**హిరమండలం, జులై 10 (వార్త):** గ్రీష్మకాల మార్తాండుడు నిప్పులు చెరుగుతున్న వేళ నీలాకాశం నల్లటి మబ్బుల తెరలతో గొడుగు పట్టాలని ప్రతీ ఒక్కరూ ఆశిస్తారు. మన దేశంలో జోరుగా వానలు మోసుకొచ్చే నైరుతి రుతుపవనాల గురించి భారత వాతావరణ విభాగం (ఐఎండీ)ఏటా విడుదల చేసే అంచనాల గురించి అందరిలోనూ ఆసక్తి ఉంటుంది. అంచనాలు తప్పినప్పుడు ఆసక్తి స్థానంలో నిరాసక్తత ఏర్పడటమూ రివాజే. ఈ సారి కూడా ఐఎండి అంచనాలు కాస్త గురి తప్పాయి. చాలా ముందే రుతుపవనాలు ఆగమిస్తాయని చెప్పడంతో మొదలు పెట్టి అవి వచ్చేశాయని కూడా ప్రకటించి నాలిక్కరుచుకోవడంతో ఎప్పటి కన్నా ఎక్కువుగా ఐఎండీపై విమర్శల జోరు పెరిగింది. "వాన రాకడ...ప్రాణం పోకడ ఎవరికీ తెలియదు" అన్నది నానుడి. కానీ ఏళ్లు గడుస్తున్న కొద్దీ ఈ నానుడికి విలువ లేకుండా పోతుంది. క్షణం సేపు ఆగిన ప్రాణాన్ని సైతం నిలబడుతున్న మాదిరే వాతావరణ అంచనాలు కూడా దాదాపు సరిగానే ఉంటున్నాయి.... కాలం దోబూచులాడుతోంది. జూలై రెండో వారం పూర్తియినా...సంవృద్ధిగా వర్షాలు పడకపోవడం...ఏ రోజుకారోజు మబ్బులు పట్టడం ఆ తరువాత వదిలేస్తుండటంతో వానాకాలం సాగు పనులు ముందుకు సాగటం లేదు. ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉండటంతో రైతులు ఆంధోళన చెందుతున్నారు. ఆలస్యంగానైనా వచ్చిన నైరుతి పవనాల ప్రభావం అంతగా చూపలేదు. ఓ వైపు ఆడపాదడపా పడుతున్న చిరుజల్లులకు దుక్కులు దున్నిన వరి విత్తనాలు వేసి వాన జాడ కోసం ఆకాశం వంక చూస్తున్నారు. మరో వైపు జిల్లాలోని చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరులు అడుగంటుతున్నాయి. ఆకాశంలో దట్టంగా మబ్బులు వేసినా... ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావటం లేదు. జిల్లా పలు చోట్ల ఓ దగ్గర వర్షం పడితే...మరో చోట పడని పరిస్థితి నెలకుంది. జిల్లా విస్తారంగా వర్షాలు కురియకపోవటంతో వర్షం జాడ కోసం ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. మరో వారం రోజుల పాటు ఎండల తీవ్రత ఇలానే ఉంటే వేసిన వరి విత్తనాలు భూమిలోనే పొట్లిపోయి మొక్కలు రావని, మళ్లీ విత్తుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా వానలు దోబూచులాడుతున్నాయి.

ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా సంవృద్ధిగా వర్షాలు కురియాలంటూ పలు చోట్ల వివిధ రకాల పూజలు నిర్వహిస్తున్నారు...కప్పకు పూజలు, శివునికి జలాభిషేకాలు చేస్తున్నారు. ఈ సారి తొలకరి వర్షాలు బాగానే కురుస్తాయన్నట్టుగా వాతావరణంలో మార్పులు కన్పించినా చినుకు రాలక రైతుల్లో నిరాశే మిగిలింది. రోహిణి, మృగశిర కార్తెలు పూర్తయినా విత్తనాలు వేసేలా వర్షాలు పడడం లేదు.

### రైతుల విరాళాలతో
## గ్రోయిన్ మరమ్మతులు



**ఇచ్ఛాపురం, జూలై 10, (వార్త):** ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా ఖరీఫ్ సీజన్ దాటిపోతుండడంతో రైతులు స్వచ్ఛందంగా విరాళాలు పోగు చేసుకుని గ్రోయిన్ మరమ్మతులు చేపడుతున్నారు. బెల్లుపడ రైతులు బహుదా ఆనకట్ట కింద ఉన్న సుమారు 18 వందల ఎకరాల పంట పొలాలకు నీరు అందించేందుకు ప్రొక్లెయిన్ సాయంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

## బూరగాం.. టీడీపీకి గుండెకాయ

**టెక్కలి, జులై 10 (వార్త):** టెక్కలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి బూరగాం గ్రామం గుండెకాయ లాంటిదని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు అన్నారు ఈ మేరకు బుధవారం నాడు బూర్గం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేశారు అనంతరం పోకల నగేష్ శర్మ ఆధ్వర్యంలో నూతన పార్టీ కార్యాలయానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పశుశంవర్ధక, సహకార బ్యాంకు, డైరీ డెవలప్మెంట్, మత్స్య శాఖ కింజరాపు అచ్చెన్నాయుడు ఫోన్లో ప్రసంగిస్తున్న ఆడియోను టిటిపి అభిమానులకు వినిపించారు. ఈ సందర్భంగా అచ్చం నాయుడు మాట్లాడుతూ గ్రామంలో కార్యకర్తలు అందరూ సమైక్యంగా ఉండాలని మండలంలోని అతిపెద్ద పంచాయతీ అని తెలిపారు మాటిస్తే చేసే వ్యక్తి నాయుడు అని, మరికొద్ది రోజుల్లో పూర్తిస్థాయి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. వివాదాలకు దూరంగా పార్టీ అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రభుత్వ కార్యక్రమాలు అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలిపారు ప్రతిపక్షాలపై కక్ష కట్టి గ్రామాల్లో అశాంతి వాతావరణం వద్దని తాము చేసే అభివృద్ధి ప్రతిపక్షాలకు గుణపాఠం కావాలని తెలిపారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, దల్లి ప్రసాద్ రెడ్డి, గేదిల సంజీవ్ రెడ్డి, జనపాన రూపావతి, జనపాన తేజ, గేదిల రమణయ్య, గేదిల శ్రీనివాస్ రావు, కోదండ, మల్లేష్, చంద్రరావు, కనకరాజు, అరుణ్, కృష్ణ రెడ్డి, బూరగాం టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి

**ఇచ్ఛాపురం, జూలై 10(వార్త):** విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని సీఐ టి. ఇమ్మనియల్ రాజు అన్నారు. స్థానిక జ్ఞాన భారతి సి బి ఎస్ ఈ సీనియర్ సెకండరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం పాఠశాల డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పాఠశాల సెక్రటరీ, సీఈవో జోహార్ ఖాన్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్కిల్ ఇన్స్పెక్టర్ టి ఇమాన్యుల్ రాజు, పట్టణ ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇమ్మాన్యువల్ రాజు మాట్లాడుతూ అత్యున్నత విద్యా ప్రమాణాలతో జ్ఞాన భారతి పాఠశాలలో విద్యా బోధన జరుగుతుండడం పట్ల అభినందనలు తెలిపారు. ప్రస్తుత ప్రపంచానికి సరిపడే విధంగా టెక్నాలజీతో అనుసంధానమయ్యే విద్యను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, అటువంటి విద్యను జ్ఞాన భారతి అందించడం గొప్ప విషయమన్నారు. మైక్రోసాఫ్ట్ హైబ్రిడ్ లెర్నింగ్ సెంటర్ విద్యార్థులకు ఎంతో ఉపకారిగా ఉంటుందని పేర్కొన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెచ్ఎమ్ రషీదా సుల్తానా, పాఠశాల మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, పిఈటిలు కైలాస్ పండా, రాము పాల్గొన్నారు.

## చంద్రన్న బీమా పంపిణీ

**ఇచ్ఛాపురం, జులై 10(వార్త):** 17వ వార్డు లాలాపేటకు చెందిన తుంగనా మహేష్ అనే ఆటో డ్రైవర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య ధన లక్ష్మికి లక్ష రూపాయల పరిహారం మంజూరు అయ్యింది. అలాగే టెంక కుమార్ అనే వ్యక్తి కూడా మృతి చెందడంతో మృతుని భార్య సావిత్రి కి కూడా పరిహారం మంజూరైంది. ఈ మొత్తం బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ఈ కార్యక్రమంలో వార్డు తెలుగుదేశం ఇంచార్జి జన్నెల సంతోష్ యాదవ్, ఎం డి జిలాని, వెల్ఫేర్ సెక్రెటరీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సహకరించండి

**ఆమదాలవలస, జులై 10(వార్త):** గ్రామాభివృద్ధికి కూటమి నేతలు సహకరించాలని పురుషోత్త పురం సచివాలయ సిబ్బంది అన్నారు. బుధవారం సచివాలయంలో కూటమి నేతలు కిల్లి సిద్ధార్థ, పైడి మురళీమోహన్రావుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని సచివాలయ సిబ్బంది బహుకరించారు. కార్యక్రమంలో కిల్లి గోపి, పైడి కృష్ణ, పప్పల విజయ్, కిల్లి రాజారావు, కొత్తకోట విష్ణు, కూటమి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి

**హిరమండలం, జులై 10(వార్త):** విద్యార్థుల విద్యాసామర్థ్యం పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు సూచించారు. బుధవారం మండలంలో దుర్భలాపురం, కొండరాగోలు పాఠశాలలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేపడితే చర్యలు



**హిరమండలం, జులై 10(వార్త):** వంశధార నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పదని తహశీల్దార్ బి.సుధాకర్ హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా జరిపే ప్రాంతాల్లో కందకాలను తవ్వించారు. వీటిని పూడ్చి అక్రమ రవాణా చేపడితే చర్యలు తప్పదని ఆయన హెచ్చరించారు. మండలంలో తహశీల్దార్ కార్యాలయం వెళ్లే రహదారితో పాటు సుభలాయ్, భగరధీపురం తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా కందకాలను తవ్వించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు అక్రమ ఇసుక రవాణా జరగకుండా విఆర్ఓలు పరిశీలించాలన్నారు.

## ఏఎస్ఐగా గోవిందరావు

**హిరమండలం, జులై 10(వార్త):** హిరమండలం పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా పనిచేస్తూ ఎఎస్.ఐగా పదోన్నతి పొంది కొత్తూరు పోలీస్ స్టేషన్కు బదిలీ అయిన గోవిందరావును పోలీస్ సిబ్బంది అభినందించారు. బుధవారం హిరమండలం పోలీస్ స్టేషన్ నుంచి రిలీవ్ అయి, కొత్తూరు పోలీస్ స్టేషన్లో ఎఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

## ట్రాఫిక్ నిబంధనలపై వీడియో తరగతులు

**ఇచ్ఛాపురం, జూలై 10(వార్త):** స్థానిక శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సును వీడియో తరగతులు ద్వారా బుధవారం నిర్వహించారు. హెల్మెట్ ధరించిపోవడం వల్ల కలిగే నష్టాలు, ధరించడం వల్ల కలిగే ఉపయోగాలపై వీడియోలద్వారా పిల్లలకు చూపించారు. కార్యక్రమంలో స్కూలు చైర్మన్, అడ్వకేట్ దక్కత కృష్ణమూర్తి రెడ్డి, స్కూల్ మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, జ్యోత్స్న, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ తేజెస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి

**ఆమదాలవలస, జులై 10(వార్త):** మండలంలోని కౌలు రైతులందరూ గుర్తింపు కార్డు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మిట్ట మోహన్ రావు అన్నారు. బుధవారం శ్రీనివాసచార్యుల పేట గ్రామంలో విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందడం వల్ల పంట రుణాలు, పంటల బీమా, పంట నష్టపరిహారం, వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు అమ్మకాలు మొదలగు కార్యక్రమా లన్నీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతిరావు, ఇఫ్కో డిఎం లోకేష్, రైతులు పాల్గొన్నారు.

## జగన్నాథ సన్నిధిలో నాద నీరాజనం

**ఇచ్ఛాపురం, జులై10(వార్త):** జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలలో భాగంగా గుండిచా మందిరంలో సాంస్కృతిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానిక కళాకారులు గాత్రంపై బతకల జయమ్మ కీబోర్డ్ గోపి తబలపై దొన్ను వాయిద్య సహకారాన్ని అందించారు. చిన్న గురుస్వామి ఆధ్వర్యంలో ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి బెండి రామారావు పర్యవేక్షణలో కళాకారులకు సత్కరించారు.





Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413